## విలేఖర్లు కావలెను

జ్యోతి ప్రభంజనం దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో జిల్లాలకు బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్‌లు, ఆర్ సి ఇన్చార్జ్‌లు, మండల రిపోర్టర్‌లు కావలెను.

సంప్రదించ వలసిన నెంబర్:
7095999737,9908103501

PRGI NO:TGTEL/26/A6501

# జ్యోతి ప్రభంజనం

తెలుగు దిన పత్రిక

సంపుటి :01 సంచిక:03 ఎడిటర్: రాపోలు లింగస్వామి 03 -09 -2026 గురువారం

Printed/:Rangareddy , Published By: Hyderabad , Nalgonda, Rangareddy, Mahaboobabad, Medak,worangal,Nizamabad, Adilabad,Karimnagar,Kammam, పేజీలు:4 వెల: 2-00

### ఆ విమానాశ్రయాల పనులు

## వేగవంతం చేయండి

**: సీఎం రేవంత్‌రెడ్డి**




ఢిల్లీ, సెప్టెంబర్ 2 : కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో.. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఢిల్లీలోని పౌర విమానయాన శాఖ కార్యాలయం రాజీవ్ గాంధీ భవన్‌లో బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. తెలంగాణలో ఆదిలాబాద్, మామునూరు (వరంగల్) విమానాశ్రయాల పనులు వేగవంతం చేయాలని కోరారు. మామునూరు విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణను పూర్తి చేసి ఇచ్చామని కేంద్రమంత్రికి.. సీఎం రేవంత్ తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో కార్గో, ప్యాసింజర్ టెర్మినల్, ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్) వసతులు ఏర్పాటు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్‌లో రన్ వే ఫైనలైజ్‌కు సంబంధించి రక్షణ, పౌర విమానయన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ టెండర్లను రెండు వారాల్లో పిలిచి డిసెంబర్ నాటికి ఖరారు చేస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్ వెల్లడించారు. ఆ పనులకు అదే నెలలో శంకుస్థాపన చేస్తామని రామ్మోహన్ తెలిపారు. తెలంగాణలో ఛాపర్ల ద్వారా హెలీ టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని కేంద్రమంత్రి రామ్మోహన్‌కు.. సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. హెలీ టూరిజంతో తెలంగాణలో పర్యాటక రంగం మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. హుస్సేన్ సాగర్‌లో సీ ప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని పౌర విమానయాన శాఖ అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీలు సురేశ్ షెట్కార్, ఎం.అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

### నాపై చర్యలు తీసుకునే ముందు

## సీఎంపై కూడా తీసుకోవాలి..

**మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు**

నాపై చర్యలు తీసుకునే ముందు సీఎం రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌పై సురేఖ డైరెక్ట్ అటాక్ చేశారు. ఢిల్లీలో హైకమాండ్‌ను కలిసిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి పదేళ్లు సీఎం అని తనే చెప్పుకుంటు న్నాడు. అది ఎంత వరకు సమంజసమన్నారు. రాష్ట్ర కేబినెట్‌లో ఇతర శాఖ మంత్రులపై అనేక ఆరోపణలు ఉన్నాయి. సీఎంపై మంత్రులు, నేతలు కూడా తీవ్ర అసంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు తనని రాజీనామా చేయమని, మరొకటిగాని నాకు ఎవరు చెప్పలేదు. హైకమాండ్‌కు రాతపూర్వకంగా అన్ని వివరాలు తెలియజేశానని తెలిపారు. నా బిడ్డ మాట్లాడితే నాకెందుకు శిక్ష వేస్తారు. రెడ్లలో ఎంతో మంది అనుచిత వ్యాఖ్యలు చేశారు. వారిపై ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు. బీసీకి ఒక న్యాయం ఇతర సామాజిక వర్గాలకు మరో న్యాయమా? అని ప్రశ్నించారు. అంతా సద్దుమణి గింది అనుకునే తరుణంలో సురేఖ వ్యాఖ్యల అంతరార్థం ఏటంటనే చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతున్నది. ఢిల్లీలో రాజీ మంత్రం



బెడిసికొట్టడం వల్లే ఆమె ఇలా మాట్లాడుతుందేమోనని రాజకీయ విశ్లేషకులు అనుమానిస్తున్నారు. మరోవైపు సురేఖపై అధిష్ఠానానికి సీఎం నివేదికను అందజేశారు. సాధ్యమైనంత త్వరగా ఆమె చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. ఈరోజే కొండా సరేఖపై హైకమాండ్ చర్యలుతీసుకునేఅవకాశం ఉన్నట్లు సమాచారం.

## జల సంరక్షణలో తెలంగాణ టాప్



హైదరాబాద్: దేశవ్యాప్తంగా చేపట్టే ప్రతి జల సంరక్షణ పనిని ఒకే జలభద్రతా ప్రణాళిక పరిధిలోకి తీసుకురావాలని, ప్రతి ఆస్తికి జియో ట్యాగింగ్‌తో కూడిన ప్రత్యేక గుర్తింపు ఉండాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలోని సుష్మా స్వరాజ్ భవన్‌లో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తొలి జల్ సంచయ్-జన్ భాగీదారీ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. జలభద్రతను కేవలం ఇంజనీరింగ్ బాధ్యతగా కాకుండా, తాగునీరు, వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ కోసం ఒక గొప్ప ప్రజా ఉద్యమంగా మలచాలని ఆయన ఆకాం క్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల ద్వారా చేపడుతున్న జల సంరక్షణ పనుల్లో సమ న్వయం లోపిస్తే పునరావృతం, నిర్వహణ లోపాలు తలెత్తుతాయని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. జల సంరక్షణలో 2025లో తెలంగాణ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిందని, దేశంలోని టాప్-50 జిల్లాల్లో రాష్ట్రానికి చెందిన 13 జిల్లాలు చోటు దక్కించుకున్నాయని మంత్రి ఉత్తమ్ గుర్తు చేశారు. రాష్ట్రంలో 2026 నుంచి 20-29 వరకు మూడేళ్ల ప్రణాళికలో భాగంగా రూ.46,110.35 కోట్ల అంచనా వ్యయంతో 17.28 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. జలాశయాల్లో పూడికతీత వల్ల కోల్పోతున్న నిల్వ సామర్థ్యాన్ని కాపాడుకునేందుకు దిగువ మానేరు, మధ్య మానేరు, కడెం ప్రాజెక్టుల్లో ప్రయోగాత్మకంగా పూడికతీత చేపట్టినట్లు వివరిం చారు. ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన కింద అర్హత కలిగిన ప్రాజెక్టులకు కేంద్ర సాయం అం దించాలని, ఎఫ్ఆర్‌బిఎం పరిమితుల్లో వెసులుబాటు కల్పించాలని ఆయన కోరారు. వర్షపాతం, జలాశయాల నిర్వహణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను వినియోగించాలని మంత్రి సూచించారు.

### పాఠశాల స్థాయి నుంచే విద్యార్థినులు సాంకేతిక

## పరిజ్ఞానం పెంపొందించుకోవాలి..

**ఉన్నత లక్ష్యాలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి.**

**గ్రామీణ నీటీసరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క.**



మంగపేట అఖండహిందుస్థాన్ సెప్టెంబర్ 2..మంగపేట మండల పరిధిలోనిపాఠశాల స్థాయి నుంచే విద్యార్థినులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని, ఉన్నత లక్ష్యాలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.బుధవారం మంగపేట మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో బాలవికాస స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన 14 ల్యాప్‌టాప్‌లతో కూడిన కంప్యూటర్ ప్రయోగశాలను మంత్రి అనసూయ సీతక్క ప్రారంభిం



చారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థినులు చదువుతోపాటు సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని సూచించారు. ఉన్నత చదువులకు వెళ్లినప్పుడు 2 వ పేజీలో ..

## మైనార్టీ మహిళలకు అండగా ప్రభుత్వం..

**నియోజకవర్గంలో 95 మందికి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**



రాజేంద్ర నగర్ : 03 సెప్టెంబర్ :రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన' పథకంలో భాగంగా రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర మైనార్టీ శాఖమంత్రి శ్రీ అజారుద్దీన్ గారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ×శ్రీ ప్రకాష్ గౌడ్× గారు ముఖ్య అతిథిగా పాల్గొని, నియోజకవర్గానికి చెందిన మైనార్టీ సోదరీమణులకు చెక్కులను పంపిణీ చేశారు.ఈ పథకం కింద రాజేంద్రనగర్ నియోజకవర్గానికి మొత్తం 95 చెక్కులు మంజూరయ్యాయి. లబ్ధిదారులైన ప్రతి మహిళకు ప్రభుత్వం రూ. 50,000 చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేస్తోంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ.. మైనార్టీ మహిళల ఆర్థిక సాధికారత, వారి సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. లబ్ధిదారులు ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని తమ కుటుంబాలకు అండగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఓఙఅ శ్రీ పట్నం మహేందర్



రెడ్డి గారు మరియు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గారు షాద్నగర్ ఎమ్మెల్యే గారు జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు మైనార్టీ మహిళా లబ్ధిదారులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు

## ఇది 1000 రోజుల ప్రభుత్వ పాలన కాదు..

**వెయ్యి రోజుల కాంగ్రెస్ ప్రజా పీడన!**

**మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి**



రంగారెడ్డి జిల్లా, జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 02:బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో వారం రోజుల పాటు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలపై బీఆర్ఎస్ పోరుబాట కార్యక్రమంలో భాగంగా, బుధవారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు 420 అడుగుల కాంగ్రెస్ 420 హామీల ఫ్లెక్సీతో భారీ ప్రదర్శన× నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు,



కార్యకర్తలతో కలిసి పాల్గొని ధర్నా నిర్వహించారు.అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో రాస్తా రోకో నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేసిన మోసాలను, ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అరాచకాలను ఎండగట్టారు., కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతో పాటు స్థానిక ఎమ్మెల్యే కారణంగా నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను వివరించి, ప్రజా సమస్యలపై ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించారు. ఈ అంశాలన్నింటినీ ప్రజలకు చేరవేసేలా ప్రసంగించారు.

జ్యోతి ప్రభంజనం



# సంపాదకీయం

## దక్షిణం రాదు, ఉత్తరమూ పోతుందా?

పరిస్థితులు ఇదే విధంగా కొనసాగితే బీజేపీకి వచ్చే లోక్‌సభ ఎన్నికలలోనూదక్షిణభారతం వశపడదు. ఆ మాట వారికీ తెలుసు. అయితే ఈ సారి ఉత్తర భారతం కూడా చేజారిపోవచ్చునా? ఆ విషయం ఇప్పటికిప్పుడైతే నిర్ధారణగా అంచనా వేయలేము. కానీ ఆ ప్రమాదమైతే ఉన్నట్టు ఆ పార్టీ నాయకత్వానికి అర్థమవుతున్న దనుకోవాలి. అందుకే ముందు జాగ్రత్త కోసం తిమ్మిని బమ్మిని చేసైనా ఇతర పార్టీలను చీల్చటం, 'సర్' పేరిట ఓటర్ జాబితాలను గందరగోళంగా మార్చటం చేస్తున్నారు. ఈ వక్రమార్గాలనైతే అధికార దుర్వినియోగంతో అనుసరించగలరు గానీ, ప్రజల్లో ప్రబలుతున్న వ్యతిరేకతను ఏం చేయగలరు?

కొరకరాని కొయ్యగా మారిన దక్షిణాపథం గురించి ఎన్నెన్ని శపథాలు చేసి ఏమేమి వ్యూహాలు రచించినా, ఆ నేల స్వాధీనం కాకపోగా ఈ సారి 2019 నాటి 31 స్థానాలైనా రాగల సూచనలు లేవు. నియోజకవర్గాల పునర్విభజన, సర్ ఎత్తుగడలు అమలుకు వచ్చినప్పటికీ. కారణం, వారిక్కడ స్వయంగా క్షేత్రస్థాయిలో బలపడుతున్నది.

'పరిస్థితులు ఇదే విధంగా కొనసాగితే' అన్నమాటకు మొదట కొన్ని వివరణలు చెప్పుకోవాలి. బీజేపీ 2009లో గెలిచిన లోక్‌సభ స్థానాలు116. ఆ సంఖ్య 2014లో ఒకేసారి 166 పెరిగి 282కు చేరింది. అధికారం లభించింది. లోగడ వాజపేయి నాయకత్వం లోనూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా సొంత మెజారిటీతో అధికారానికి రావటం ఇదే మొదటిసారి. అట్లా జరగటానికి ప్రధానంగా రెండు కారణాలున్నాయి. ఒకటి, అప్పుడు ఉండిన మన్మోహన్‌సింగ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై వచ్చిన అవినీతి, అసమర్థ పాలన విమర్శలను ప్రజలు నమ్మటం. రెండు, బీజేపీ ప్రధాని అభ్యర్థి నరేంద్రమోదీ ముఖ్యమంత్రిత్వ కాలంలో గుజరాత్ అద్భుతంగా అభివృద్ధి చెందిందనే ప్రచారాలతోపాటు, అదే తరహా గుజరాత్ మాడల్‌ను దేశమంతటా అమలు చేయగలరనే ప్రచారాన్నికూడా విశ్వసించటం. అందువల్లనే పార్టీ బలం అనూహ్యంగా పెరిగింది. ఆ విధంగా ఐదేండ్లు గడిచినాక, ఆ ప్రచారాలు నిజం కాదని ప్రజలకు అర్థం కావటం నెమ్మదిగా మొదలైంది. గుజరాత్ మాడల్ గురించిన వాస్తవాలు వెలుగులోకి రాసాగాయి.

ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు, విదేశాల్లోని నల్లధనాన్ని తెప్పించి ప్రతి కుటుంబానికీ రూ.15 లక్షలు ఇవ్వడం వంటి హామీలు వగైరా వట్టివిగా తేలాయి. అయినప్పటికీ మరుసటి 2019 ఎన్నికల్లో బలం తగ్గకపోగా 282 నుంచి 303కు పెరిగింది.

ఎందువల్ల? ఒకటి, మోదీపై భ్రమలు ఇంకా తగినంతగా పోలేదు. రెండు, అయోధ్య రామ మందిర నిర్మాణాన్ని పురస్కరించుకుని, ఇతరత్రా కూడా మత భావనలను బాగా పురికొల్పారు. మూడు, కాంగ్రెస్ సహా ప్రతిపక్షాల బలహీనతలు, అనైక్యతలు బీజేపీకి కలిసివచ్చాయి. నాలుగు, మోదీని మించిన నాయకుడు లేడని, తనను యావత్ ప్రపంచం కీర్తిస్తున్నదని, ఆయన చైనా, పాకిస్థాన్‌లకు తగిన శాస్తి చేశారనే ప్రచారాలు హోరెత్తించారు. ఐదు, ఆర్థిక రంగంలో మనం బ్రిటన్, జర్మనీ, జపాన్‌లను మించిపోయి, ప్రపంచంలో మూడో స్థానానికి ఎదిగామని, ఇక పోటీ చైనా, అమెరికాలతోనేనని లెక్కలు గట్టి చూపారు. మామూలుగానైతే ప్రజలు ఈ తరహా ప్రచారాలను గత ప్రచారాల వలెనే నమ్మాలి. నమ్మినవారు లేరని కాదు. చాలానే ఉన్నారు. కానీ నమ్మని వారి సంఖ్య పెరగటం మొదలైంది. అందుకే సీట్ల సంఖ్య 2024 ఎన్నికల్లో వారు ఆశించినట్టు 2019 నాటి 303 కన్నా మరింత పెరుగలేదు. సరికదా 2014 నాటి 282 కంటే కూడా తగ్గిపోయి 240 దగ్గర ఆగిపోయింది. ఈ లెక్కలు మరింత సూటిగా అర్థమయ్యేట్టు చెప్పుకొందాము. 2009లో 116; 2014లో 282; 2019లో 303; 2024లో 240. అనగా 2019 కన్నా 63 సీట్లు, 2014 కన్నా 42 సీట్లు తక్కువ. ఇవి స్పష్టంగా పతన సూచీలు.

మరొక విధంగా చెప్పాలంటే, మోదీ నాయకత్వం 2014లో, 2019లో సంపాదించిన సొంత మెజారిటీలు రెండు ఎన్నికలు గడిచి మూడోది వచ్చేసరికి తుడిచిపెట్టుకుపోయాయన్నమాట. ఇప్పుడు 'మోదీ మాడల్' అనే మాటను ప్రజలు మరచిపోయారు. స్వయంగా బీజేపీ కూడా అనటం లేదు. ఆ నమూనాలో పరిపాలన అంటే ఏమిటో ఎవరూ చర్చించటమైనా వినిపించదు. ఆర్థిక వ్యవస్థమూడో స్థానానికి చేరిన మాట నిజం కాదని, ఇంకా ఆరో స్థానంలోనే ఉన్నామని తెలిసిపోయింది. ఈ తరహా స్థానాల మాట ఎట్లున్నా వేర్వేరు అభివృద్ధి సూచీలు అన్నింటిలో ఇతర దేశాలతో పోల్చినప్పుడు మన ర్యాంకులు పతనమవుతుండటమే కనిపిస్తున్నది. రూపాయి విలువ దారుణంగా పతనమవుతున్నది. ధరలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వివిధ దేశాల పర్యటనలు జరిపి అక్కడి నాయకులను ఎంత కౌగిలించుకుం టున్నా వారు మనను తమ ఆర్థిక ప్రయోజనాల కోసం, సైనిక వ్యూహాల కోసం ఉపయోగించుకొనజూడటం మినహా నిజమైన గౌరవం అంటూ పెరుగుతున్నదిలేదని బోధపడుతున్నది. అమెరికా అధ్యక్షుడు తరచూ ఈసడిస్తున్నా, ఇజ్రాయెల్ ప్రధానితో మితిమీరిన మైత్రీబంధం ఎంత అప్రదిష్టను తెస్తున్నా మోదీ తీరు మారకపోవటాన్ని ఇప్పుడందరూ గుర్తిస్తున్నారు. పరిస్థితులు ఇదే విధంగా కొనసాగితే అన్నమాట పరిధిలోకి ఇవన్నీ వస్తాయి. ఇవేకాదు, మరికొన్నికూడాఉన్నాయి. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల సంగతి అట్లుంచి 12 ఏండ్లలో కలిపి కూడా అవి కనిపించటంలేదు. ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామన్నది ఓట్ల కోసం

# అథ్లెటిక్స్ పోటీలలో విద్యార్థుల ప్రతిభ

**- విద్యార్థులకు అభినందనలు వెలువ**

**- సింగరేణి కళాశాలకు మరింత పేరు తీసుకురావాలని సూచన**

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సంయుక్తంగా హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో ఇటీవల తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ పోటీలలో కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ ఉమెన్స్ జూనియర్ కళాశాల విద్యార్థినులు పాల్గొని విశేష ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలలో కళాశాలకు చెందిన సీనియర్ సిఇసి విద్యార్థిని చింతల వేదశ్రీ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించి స్వర్ణ పతకం గెలుచుకుంది. అలాగే సిఇసికి చెందిన డి.మధు ప్రియ ఆమె బృందం అద్భుతమైన ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం సాధించి కాంస్య పతకం గెలుచుకున్నారు. ఈ విజయం కళాశాలకు సింగరేణి సంస్థకు గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా స్వర్ణ, కాంస్య పతకాలు సాధించిన సింగరేణి కాలరీస్ ఉమెన్స్ జూనియర్ కళాశాల విద్యార్థినీలను బుధవారం సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ జనరల్ మేనేజర్ (పర్సనల్)సెక్రటరీ జి.రాజేంద్ర ప్రసాద్, జాయింట్



సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పి.కాంతారావు, కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ శ్రీలత, పిఈటి అరుణశ్రీ అభినందించి భవిష్యత్తులో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి దేశానికి సింగరేణి సంస్థకు కళాశాలకు మరింత పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు సాధించిన విజయం పట్ల కళాశాల అధ్యాపకులు విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ వీరికి అభినందనలు తెలియజేశారు.

**మొదటి పేజీ తరువాయి ..**

## పాఠశాల స్థాయి నుంచే విద్యార్థినులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి..

కంప్యూటర్లు, ఇతర సాంకేతిక పరికరాలను వినియోగించడంలో ఇబ్బందులు ఎదురుకాకుండా ఇప్పటి నుంచే వాటి వినియోగంపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థినులు కంప్యూటర్ విద్యను అభ్యసించేందుకు 14 ల్యాప్‌టాప్‌లను అందుబాటులోకి తీసుకువచ్చామని, ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో చదివిన విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కన్నాయిగూడెం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి వరకు చదివి, అనంతరం జవహర్‌నగర్‌లో ఇంటర్ విద్యను అభ్యసించిన విద్యార్థిని రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించిందని గుర్తుచేశారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే పట్టుదలతో చదవాలని, పదో తరగతి, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించాలని సూచించారు. తల్లిదండ్రులకు, విద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యాలయంలో భోజన నాణ్యత, మరుగుదొడ్ల నిర్వహణ, నీటి సరఫరా, ఇతర సౌకర్యాల గురించి మంత్రి విద్యార్థినులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే సంకోచించకుండా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థినులు తమ భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని, పగలు లేదా రాత్రి వేళల్లో ఉపాధ్యాయులకు తెలియజేయకుండా ఒంటరిగా బయటకు వెళ్లవద్దని సూచించారు. చదువుతోపాటు శారీరక ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు. సమష్టిగా శ్రమదాన కార్యక్రమాల్లో పాల్గొని విద్యాలయ ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అందుబాటులో ఉన్న స్థలంలో కూరగాయల పెంపకంపై అవగాహన పెంచుకోవడంతోపాటు జామ, మామిడి వంటి పండ్ల మొక్కలను నాటి సంరక్షించాలని సూచించారు. భవిష్యత్తులో తాము చదివిన విద్యాలయానికి తిరిగి వచ్చినప్పుడు, తాము నాటిన మొక్కలు వృక్షాలుగా ఎదగడం చూసి ఆనందించేలా వాటిని సంరక్షించాలన్నారు. విద్యార్థినులందరూ బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, జీసీడీఓ బుర్ర రజిత, మండల విద్యాశాఖ అధికారి మేనక, పాఠశాల ప్రత్యేక అధికారి భాగ్యలక్ష్మి, ఉల్లాస్ సమన్వయకర్త కృష్ణ బాబు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిశ్శబ్దపు సరిహద్దు



విషపూరిత మనుషులతో
వాదించి గెలవలేవు?
ఎందుకంటే వాళ్లకు నిజం వినిపించదు,
నీ ఓటమి మాత్రమే కావాలి.
నువ్వెంత నిజాయితీగా మాట్లాడినా
వాళ్లు అర్థం చేసుకోరు,
నీ ప్రతి మంచిమాటలోనూ
ఒక తప్పును వెతుకుతారు.
నీ సహనాన్ని బలహీనతగా,
నీ మౌనాన్ని చేతకానితనంగా,
నీ మంచితనాన్ని అవకాశంగా
మార్చుకోవడమే వాళ్ల స్వభావం.
అందుకే ప్రతిసారీసమాధానం
చెప్పాల్సిన అవసరం లేదు,
ప్రతి ఆరోపణకునిరూపణ ఇవ్వాల్సిన పనిలేదు.
కొన్ని మనుషులను ఓడించడానికి
వాళ్లతో పోరాడాల్సిన అవసరం లేదు?
వాళ్లకు నీ జీవితంలో
ఒక్క అడుగు స్థలం ఇవ్వకపోవడమే చాలు.
ఒక నిశ్శబ్దపు గీత గీయి?
అది కోపంతో గీసిన గీత కాదు,
నీ ఆత్మగౌరవాన్ని కాపాడే
ఒక పవిత్రమైన సరిహద్దు.వాళ్లను ద్వేషించకు?
వాళ్లను మార్చాలని ప్రయత్నించకు?
కేవలం నీ ప్రశాంతతకు
వాళ్లకు తాళం చెవి ఇవ్వకు.
ఎందుకంటేప్రతి సంబంధం కొనసాగించాల్సినది కాదు,
కొన్ని సంబంధాల నుంచి బయటపడటమే
మనల్ని మనం కాపాడుకోవడం.గుర్తుపెట్టుకో?
నీ మనసుకు శాంతి దొరికే చోటేనీ నిజమైన ప్రపంచం.
ఆ శాంతిని కాపాడుకోవడానికి
నిశ్శబ్దంగా దూరం కావడం కూడాఒక గొప్ప విజయం.

రచన : రేవెల్లి పద్మ
శివాని జూనియర్ కాలేజ్, హన్మకొండ

# ప్రమాదం



అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి
ఆయుధాలు ధరించిన వాడు కాదు
అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి,
అబద్ధాన్ని నిజమని నమ్మించగలవాడే
సమాజానికి అసలైన ప్రమాదం!
చేతిలో కత్తి ఉంటే
దాని పదును కనిపిస్తుంది,కానీ మాటల్లో మాయ ఉంటే
మనసులే గాయపడతాయి!
నిజానికి రంగులు పూసి
అబద్ధానికి అందం అద్దుతాడు,
నమ్మకాన్ని ఆయుధంగా చేసుకుని
నిజాయితీని నిశ్శబ్దం చేస్తాడు!
తాను చెప్పిందే నిజమని
వినేవారి మెదళ్లలో నాటుతాడు,
వాస్తవాన్ని ప్రశ్నించే వారినే
అపరాధులుగా నిలబెడతాడు!
ఒక్క అబద్ధం నమ్మితే
ఒక మనిషి మాత్రమే మోసపోతాడు,
అదే అబద్ధం గుంపు నమ్మితే
ఒక సమాజమే దారి తప్పుతుంది!
అబద్ధానికి కాళ్లు లేవంటారు
కానీ దానికి రెక్కలు తొడిగితే,
నిజం నడిచేలోపేఅది ప్రపంచమంతా తిరిగొస్తుంది!
అందుకే మాటలను కాదు
వాటి వెనుక ఉన్న నిజాన్ని చూడు,
వినిపించేది నిజమా కాదా
వివేకంతో ఒక్కసారి ఆలోచించు!
ఎందుకంటే ఆయుధం గాయం చేస్తుంది
కానీ అబద్ధం తరాలను గాయపరుస్తుంది!

రచన : కె.మురళీమోహన్ రాజు, నెల్లూరు.
చరవాణి : 9866179385

# వైఎస్ఆర్ 17వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**కూకట్ పల్లి కెపిహెచ్బీ టెంపుల్ బస్‌స్టాప్‌లో ఘనంగా వైఎస్ఆర్ వర్ధంతి**

**ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన మహానేత వైఎస్ఆర్ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు**

**కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్**



కూకట్ పల్లి, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి,సెప్టెంబర్ 02:కూకట్ పల్లి నియోజకవర్గం, కెపిహెచ్బీ టెంపుల్ బస్‌స్టాప్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి కార్యక్రమం స్థానిక కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు రాజేష్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి రమేష్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానికులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేపట్టిన అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నేటికీ ప్రజల జీవితాల్లో చెరగని ముద్ర వేశాయని గుర్తు చేశారు. ముఖ్యంగా ఆరోగ్యశ్రీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులు, పేద ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన అనేక కార్యక్రమాల ద్వారా వైఎస్ఆర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలిచి, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదని బండి రమేష్ పేర్కొన్నారు. వైఎస్ఆర్ చూపిన ప్రజాసేవా స్ఫూర్తితోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రజాపాలనను కొనసాగిస్తోందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు, పేదలు, రైతులు, మహిళలు, యువత అన్ని వర్గాల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని బండి రమేష్ తెలిపారు. వైఎస్ఆర్ ఆశయాలను, ప్రజాసేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బి-బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, డిసిసి వైస్ ప్రెసిడెంట్ రాఘవేంద్ర, కెపిహెచ్బీ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు అరవింద్ రెడ్డి, ఖైతలాపూర్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కలికోట శంకర్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు నాగార్జున, మాజీ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్‌పుత్, సతీష్ గౌడ్, సీనియర్ నాయకులు గంధం రాజు, ఫణీంద్ర, బ్లాక్ మహిళా అధ్యక్షురాలు సంధ్య, ఏఎంసీ డైరెక్టర్ సుధాకర్ రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ ప్రకాష్ ముదిరాజ్ తదితర ముఖ్య నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంధ బాలికలతో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

### విద్యార్థినులకు పండ్లు పంపిణీ చేసి కేక్ కట్ చేసిన జనసేన నేత సీతారాం నాయక్



హైదరాబాద్,జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, సెప్టెంబర్ 02: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని హైదరాబాద్‌లోని యాకుత్‌పురా జనసేన పార్టీఇంచార్జ్ ఎన్. సీతారాం నాయక్ సేవా కార్యక్రమం నిర్వహించారు. మలక్‌పేట నియోజకవర్గం సైదాబాద్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ అంధ బాలికల ప్రాథమిక పాఠశాలలో బుధవారం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని అంధ బాలికలతో కలిసి సీతారాం నాయక్ కేక్ కట్ చేయించారు. అనంతరం విద్యార్థినులకు పండ్లు పంపిణీ చేసి, వారితో ఆప్యాయంగా మాట్లాడారు. పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. పవన్ కళ్యాణ్ ప్రజాసేవ, సామాజిక బాధ్యత, పేదలు, అణగారిన వర్గాల సంక్షేమం పట్ల చూపుతున్న నిబద్ధత స్ఫూర్తిదాయకమని సీతారాం నాయక్ పేర్కొన్నారు. జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం ద్వారా సమాజానికి ఉపయోగపడే సందేశాన్ని అందించవచ్చున్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ కు ఆయురారోగ్యాలు,సుఖసంతోషాలు కలగాలని, ప్రజలకు మరింత సేవ చేసే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని సీతారాం నాయక్ ఆకాంక్షించారు. విద్యార్థినులతో కలిసి కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేయడంతో పాఠశాలలో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు,తెలంగాణ రాష్ట్ర మీడియా అధ్యక్షులు జర్నలిస్ట్ సింగ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# యువత సమస్యలపై పోరాటమే ఏఐవైఎఫ్ లక్ష్యం

### సింగరేణి కాలనీలో తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ



సైదాబాద్, జ్యోతి ప్రభంజనం,సెప్టెంబర్ 2: యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, విద్యా సమస్యలు, ఉద్యోగ అవకాశాలు తదితర సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించడమే అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) లక్ష్యమని నాయకులు తెలిపారు. సింగరేణి కాలనీలో ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. 1959 మే 3న ఏర్పాటైన ఏఐవైఎఫ్ అప్పటి నుంచి యువత హక్కుల కోసం వివిధ ఉద్యమాలు నిర్వహిస్తోందని నాయకులు పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఉద్యోగ నియామకాల్లో స్థానిక యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని, నిరుద్యోగ భృతి అందించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడటంతో పాటు మహిళలపై జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా కూడా పోరాటాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. యువత భవిష్యత్తును ప్రభావితం చేసే విధానాలపై ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ, రాబోయే కాలంలో మరింత విస్తృతంగా ఉద్యమాలు చేపడతామని నాయకులు అన్నారు. సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో యాదగిరిగుట్టలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలకు యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కార్యదర్శి షేక్ మహబూబ్, యువజన నాయకులు జానీ, సలీం, రాజు, షేరు, సల్మాన్ పాషా, రవి, శీను తదితరులు పాల్గొన్నారు

# వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



హైదరాబాద్, ఎల్ బి నగర్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి,సెప్టెంబర్ 2:మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఎల్బీనగర్‌లోని కామినేని చౌరస్తా వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మన్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోచబోయిన సురేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేసిన కృషి చిరస్మరణీయమని నాయకులు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఆయన చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మహానేత ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పాల్గొని మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డికి ఘనంగా నివాళులు అర్పించారు.

# చిట్యాల ఎస్‌బీఐలో డీజీఎం పర్యటన.



చిట్యాల,నల్లగొండ: సెప్టెంబర్ 02(జ్యోతి ప్రభంజనం): చిట్యాలలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) శాఖను డీజీఎం ప్రియవ్రత మిశ్రా బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాంకు వ్యాపారాభివృద్ధి, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రుణాలు, ఖాతాదారుల లావాదేవీలు, వినియోగదారులకు అందుతున్న సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు వ్యాపారాభివృద్ధికి కృషి చేస్తున్న శాఖ మేనేజర్ బొజ్జగాని సతీష్‌తో పాటు సిబ్బందిని డీజీఎం అభినందించి బహుమతి అందజేశారు. ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలను మరింత విస్తృతంగా, మెరుగ్గా అందించాలని సూచించారు. ఈ సందర్భంగా డీజీఎం ప్రియవ్రత మిశ్రా మాట్లాడుతూ ఖాతాదారుల భద్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ కేవైసీ అప్‌డేషన్‌ను పూర్తి చేసుకోవాలని సూచించారు. కేవైసీ ప్రక్రియకు బ్యాంకు అధికారులు పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు. ఖాతాదారులకు మెరుగైన సేవలతో పాటు సామాజిక భద్రత పథకాలైన ప్రధానమంత్రి అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజనలను మరింతగా చేరువ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం పద్మ బాబు గౌడ్, చిట్యాల శాఖ మేనేజర్ బొజ్జగాని సతీష్, ఫీల్డ్ ఆఫీసర్ కొల్లాబత్తిని సిసిర, క్యాషియర్ చింతకుంట్ల మహేందర్, మణికంత, యాదగిరి, చంద్రశేఖర్, రోష్ నారా, కమల, ప్రవీణ్, కొల్లోజు వెంకటేశ్వర్లు, స్వర్ణ, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి

# కాంగ్రెస్ బాకీ కార్డు"తో బీఆర్ఎస్ నిరసన



ఎల్ బి నగర్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, సెప్టెంబర్ 02:ఈ కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ''కాంగ్రెస్ బాకీ కార్డు'' కార్యక్రమం నిర్వహించారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో సరూర్‌నగర్ స్టేడియం నుంచి కొత్తపేట వరకు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం వివిధ వర్గాల ప్రజలకు ఎంత బకాయి ఉందో వివరిస్తూ భారీ ఫ్లెక్సీలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేయాల్సిన హామీలను ఈ విధంగా పేర్కొన్నారు:

1. మహిళలకు: నెలకు రు. 2,500 చొప్పున 33 నెలలకు ?82,500 బకాయి.
2. వృద్ధులు, బీడీ కార్మికులకు: నెలకు రు.4,000 పెన్షన్ చొప్పున ?66,000 బకాయి.
3. దివ్యాంగులకు: నెలకు రు.6,000 పెన్షన్ చొప్పున ?66,000 బకాయి.
4. కళ్యాణ లక్ష్మి / షాదీ ముబారక్: ఆడబిడ్డల వివాహాలకు తులం బంగారం బకాయి.
5. విద్యార్థులకు: ఎన్నికల హామీలో పేర్కొన్న స్కూటీలు బకాయి.
6. ఫీజు రీయింబర్స్‌మెంట్: కాలేజీ విద్యార్థుల ఫీజు బకాయిలుగా రు.12,000 కోట్లు బకాయి.
7. రైతు భరోసా / రుణమాఫీ: 4 ఎకరాల రైతుకు రైతు భరోసా కింద రు.1,02,000, రుణమాఫీ కిందరు.2,00,000 బకాయి అని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.
8. వరి పంటకు రు. 500 బోనస్: ప్రతి ఎకరాకు రు.12,500, ప్రతి పంటకు రు.75,000 బకాయి అని తెలిపారు.
9. రైతు కూలీలకు: ఉపాధి హామీ పథకం కింద సంవత్సరానికి రు.12,000 చొప్పున, రెండు నెలలకు రు.24,000 బకాయి అని పేర్కొన్నారు.
10. నిరుద్యోగులకు: 2 లక్షల ఉద్యోగాలు మరియు 33 నెలలకు



నిరుద్యోగ భృతి కింద రు.1,32,000 బకాయి అని తెలిపారు.
11. విద్యా భరోసా కార్డు: విద్యార్థులకు రు.5,00,000 బకాయి అని పేర్కొన్నారు.
12. ఆటో కార్మికులకు: సంవత్సరానికి రు.12,000 చొప్పున, రెండు నెలలకు రు.24,000 బకాయి అని తెలిపారు.

**కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు: సుధీర్ రెడ్డి**

అనంతరం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. రాబోయే రోజుల్లో మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అధికార పీఠాన్ని దక్కించుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. అబద్ధపు మాటలతో అధికారంలోకి వచ్చి, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయని ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని సుధీర్ రెడ్డి అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని పలువురు మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, వివిధ డివిజన్ల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, మహిళలు, పార్టీ అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమస్యపై స్పందన.. సత్వర పరిష్కారం

### మంచినీటి సరఫరా సమస్యను పరిష్కరించిన వాటర్ వర్క్స్ అధికారులు



ఎల్ బినగర్, జ్యోతిప్రభంజనం, ప్రతినిధి,సెప్టెంబర్ 02: హస్తినాపురం డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీ ఫేజ్-1 సౌత్ పార్ట్‌లో నెలకొన్న మంచినీటి సరఫరా సమస్యకు సత్వర పరిష్కారం లభించింది. కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు తమ సమస్యను హస్తినాపురం డివిజన్-41కు చెందిన భారాస పార్టీ సీనియర్ నాయకులు రాఘవేందర్ రావు మునగాల దృష్టికి తీసుకెళ్లారు. కాలనీ వాసుల సమస్యను తెలుసుకున్న రాఘవేందర్ రావు మునగాల వెంటనే స్పందించి, పరిస్థితిని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కాలనీలో మంచినీటి సరఫరా సమస్యపై ఎమ్మెల్యే సంబంధిత వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడి, సమస్య తీవ్రతను స్వయంగా పర్యవేక్షించి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే సూచనల మేరకు వాటర్ వర్క్స్ డీజీఎం శ్రీనివాస్, మేనేజర్ భవ్య కాలనీని సందర్శించి మంచినీటి సరఫరా



సమస్యను పరిశీలించారు. అనంతరం సంబంధిత సిబ్బందితో చర్యలు చేపట్టి సమస్యను వెంటనే పరిష్కరించారు. దీంతో కాలనీలో మంచినీటి సరఫరా సక్రమంగా పునరుద్ధరించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యను వెంటనే పరిష్కరించేందుకు స్పందించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, వాటర్ వర్క్స్ డీజీఎం శ్రీనివాస్, మేనేజర్ భవ్య, అలాగే సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన రాఘవేందర్ రావు మునగాలకు కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీ వాసులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు

## ఘనంగా వైఎస్సార్ 17వ వర్ధంతి



కోదాడ, సెప్టెంబర్ 02: మండల పరిధిలోని గుడిబండ గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇర్లా నారపరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి మందుల నాగయ్య, సీనియర్ నాయకులు ఇర్ల నరసింహారెడ్డి లు పాల్గొని వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇర్ల నారపరెడ్డి మాట్లాడుతూ, వైఎస్సార్ చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఫలితంగా తెలంగాణ ప్రాంతం కూడా ఎంతో అభివృద్ధి చెందిందని గుర్తుచేశారు. అనంతరం ఇర్ల నారపరెడ్డి, వారి బృందం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి, చింతా వెంకట్ రెడ్డి, వైఎస్సార్ అభిమానులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైయస్సార్ కు నివాళులు అర్పించారు.

## సైబర్ మోసాల పట్ల
# అప్రమత్తంగా ఉండాలి

**– జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**



భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):సైబర్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం అబ్దుల్ కలాం కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటుగా ప్రసంగించారు.సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరాల రూపాలు కూడా మారుతున్నాయని ముఖ్యంగా విద్యార్థులు యువత సోషల్ మీడియా ఆన్‌లైన్ సేవలను వినియోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్ పేరుతో భయపెట్టడం నకిలీ పోలీస్ లేదా ప్రభుత్వ అధికారులుగా పరిచయం చేసుకోవడం పెట్టుబడులపై అధిక లాభాలు వస్తాయని నమ్మించి మోసం చేయడం నకిలీ యాప్‌లు లింకుల ద్వారా డబ్బులు కాజేయడం వంటి మోసాలకు సైబర్ నెరగాళ్లు పాల్పడుతున్నారని వివరించారు. ఇలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు తమ వ్యక్తిగత వివరాలు ఫొటోలు వీడియోలు పాస్‌వర్డ్‌లు ఓటిపిలు తదితర సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయవద్దని సూచించారు. సోషల్ మీడియాలో పరిచయం లేని వ్యక్తులతో చాటింగ్ చేయడం వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడం వల్ల ఫొటో మార్ఫింగ్ ఆన్‌లైన్ వేధింపులు వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని తెలియజేశారు. అదేవిధంగా సినిమాల్లో కనిపించే ప్రతి విషయాన్ని అనుకరించకుండా మంచి విషయాలను మాత్రమే స్వీకరించి చెడు ప్రభావాలకు దూరంగా ఉండాలని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేయడంతో పాటు కుటుంబాలు సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. స్నేహితుల ఒత్తిడి సరదా లేదా ఇతర కారణాలతో డ్రగ్స్‌కు అలవాటు పడవద్దని మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను గుర్తించి వారి ఆశయాలకు అనుగుణంగా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు.విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు సాంస్కృతిక ఇతర సృజనాత్మక కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొని తమ ప్రతిభను పెంపొందించుకోవాలని సూచించారు. క్రమశిక్షణ సామాజిక బాధ్యత వంటి మంచి విలువలను అలవర్చుకుని సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విద్యార్థులతో నేరుగా ఇంటరాక్ట్ అవుతూ ప్రశ్నోత్తర కార్యక్రమంలో విద్యార్థులు అడిగిన వివిధ ప్రశ్నలకు సమాధానాలు అందిస్తూ సైబర్ నేరాలు సోషల్ మీడియా డ్రగ్స్ పోక్సో వ్యక్తిగత భద్రత తదితర అంశాలపై మరింత అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యార్థులు యువత అప్రమత్తంగా ఉంటూ సైబర్ నేరాలు మాదకద్రవ్యాలు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ, సీఐ ఆర్ వెంకటేశ్వర్లు, ఎస్సైలు రమణారెడ్డి, జుబేదాబేగం, కళ్యాణి, రమాదేవి, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలం

**– వెయ్యి రోజుల పాలనలో అభివృద్ధి శూన్యం**

**– ఎంపీ వద్దిరాజు రవి చంద్ర**



భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):కాంగ్రెస్ పాలన రాష్ట్రానికి శాపంగా మరిందని అబద్దాల పునాదులపై కాంగ్రెస్ అధికారం చలాయిస్తుందని వెయ్యి రోజుల పాలనలో అభివృద్ధి శూన్యమని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఘాటుగా విమర్శించారు. బుధవారం కొత్తగూడెం సూపర్ బజార్ సెంటర్‌లో బీఆర్ఎస్ భారీ నిరసన ప్రదర్శన చేపట్టింది. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటేనన్నారు. అవి రెండు కలిసి పనిజేస్తూ బీఆర్ఎస్ ను అణచివేయాలని కుట్ర చేస్తున్నట్లు తెలిపారు. అధికారం కోసం 6 గ్యారంటీ కార్డులు పంచి, 420 హామీలు ఇచ్చారని, గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై విరుచుకుపడ్డారు. ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి ఇష్టారీతిన హామీలు గుప్పించి ప్రజలను మోసం చేశారన్నారు. వెయ్యి రోజుల పాలనలో అభివృద్ధి శూన్యమని ఘాటుగా విమర్శించారు. రైతన్నలకు రూ.2 లక్షల చొప్పున రూ.49 వేల కోట్లు రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ నాయకులు చివరకు చేసినది రూ.18 వేల కోట్లు మాత్రమేనన్నారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టి ఎకరాకు రూ.10 వేల చొప్పున పంట పెట్టుబడి అందజేసి వ్యవసాయ రంగాన్ని గొప్పగా తీర్చిదిద్దారని కొనియాడారు. రేవంత్ ప్రభుత్వం



రైతు భరోసా పేరిట ఎకరాకు రూ.15 వేల చొప్పున ఇస్తామని హామీనిచ్చి అధికారంలోకి వచ్చాక మాట మార్చారని విమర్శించారు. ఈ ప్రభుత్వం రైతు బీమా ఎగ్గొట్టిందని, కౌలు రైతుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని, సాగునీళ్లు లేవు, వరద నీళ్లను కిందకు వదిలిపెడుతూ రేవంత్ రెడ్డి తన గురుదక్షిణ చెల్లించుకుంటున్నారని దుయ్యబట్టారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేయకపోవడంతో మహిళలు పాలకులపై మండిపడుతున్నారన్నారని తెలిపారు. కాంగ్రెస్స్ 1000 రోజుల పాలనతో విసిగి వేసారిన ప్రజలు బీఆర్ఎస్, కేసీఆర్ వైపు చూస్తున్నారని ఎంపీ రవిచంద్ర చెప్పారు. తెలంగాణ రాష్ట్రానికి ప్రజలకు కేసీఆర్ పాలనయే శ్రీరామరక్ష అని రక్షణ అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కాపు సీతాలక్ష్మి, మాజీ ఎంపీపీ బాదవతి శాంతి, సోనా, బి ఆర్ఎస్ కార్పొరేటర్లు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

**– హింసను ప్రేరేపిస్తున్న ఉగ్రవాది హమారా ప్రసాద్ ను కఠినంగా శిక్షించాలి**

**– ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్**

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):భారత రాజ్యాంగ సృష్టికర్త భారతరత్న అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూఅవమాన పరుస్తూ హింసను ప్రేరేపిస్తున్న హిందూ మత తత్వ ఉగ్రవాది హమారా ప్రసాద్ ను కఠినంగా శిక్షించాలని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. భారతదేశంలో తన అపరిమిత మేదస్సుతో రచించిన రాజ్యాంగం ద్వారా దేశ సమైక్యత సమగ్రత సమానత్వం సౌభ్రాతృత్వానికి మార్గదర్శకంగా అంబేద్కర్ నిలవడం జరిగిందన్నారు. రాజ్యాంగంలో అన్ని వర్గాల ప్రజలు అంటే ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ క్రైస్తవులు, ముస్లింలు, సిక్కులు, జైనులు మహిళలు అగ్రవర్ణాల్లో ఉన్న నిరుపేద వారికి కూడా రిజర్వేషన్లను కల్పించిఈ సమాజంలో అందరూ సమాన అవకాశాలతో సమాన స్వాతంత్రంతో సమానహక్కులతో సంతోషంగా జీవించాలని స్వాతంత్ర ఫలాలు పొందాలని సామాజిక న్యాయం కోసం సమసమాజ స్థాపన కోసం అహర్నిశలు కృషి చేసి తన జీవితాన్ని త్యాగం చేసిన దేశం గర్వించదగ్గ మహానుభావుడు యావత్ ప్రపంచం ప్రస్తుతించే సర్వజన బాంధవుడు భారతరత్న బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పై ఇష్టానుసారమైన అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు. సనాతన ధర్మంలో లేని హింసను ప్రేరేపిస్తూ వేర్పాటువాదాన్ని రెచ్చగొడుతూ దేశ సమైక్యతకు భంగం కలిగిస్తున్న హిందూ మతతత్వ ఉగ్రవాది హమారా ప్రసాద్(ఆవారా ప్రసాద్)ను కఠినంగా శిక్షించాలని వీలైతే భారత శిక్షా స్మృతిలోనిచట్టాలను సెక్షన్లన్నిటినీ ఆపాదించి ఉరిశిక్ష వేయాలని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కవి సినీగీత రచయిత గాయకులు సమాజసేవకులు



గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ డిమాండ్ చేశారు. అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలను ఖండించినవారిలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అపరబాలు అల్లి శంకర్,రాష్ట్ర ఉపాధ్యక్షులుసినీ నటులు తాండూర్ ధనరాజ్, టిఎంఆర్పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుండా రమేష్, జిల్లా అధ్యక్షులు మచ్చాపృథ్వీరాజ్, కార్యదర్శి బొమ్మెర అశోక్, మాల మహానాడు జిల్లానాయకులు సూరంవరప్రసాద్,వెనుకబడిన తరగతులసంక్షేమ సంఘంరాష్ట్ర ఉపాధ్యక్షులు పి.సురేందర్, అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి భూపతి అశోక్, క్రిస్టియన్ వెల్ఫేర్ నాయకులుడాక్టర్ తమ్మళ్ళజోసెఫ్,ముస్లిం మైనారిటీ నాయకులుసల్మాన్ ఖాన్ తోత,రాజేశ్వరరావు, విజయరాజు, శ్రీనివాస్, మహేష్ తదితరులు ఉన్నట్లుగా మద్దెల శివకుమార్ పేర్కొన్నారు.

# కార్మికుల భద్రతకు పెద్దపీట.



చిట్యాల,నల్లగొండ: సెప్టెంబర్ 02(జ్యోతి ప్రభంజనం):చిట్యాల పట్టణ పారిశుధ్యాన్ని కాపాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల భద్రతకు, సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని చిట్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పందిరి గీతా రమేష్ అన్నారు. కార్మికుల ఆరోగ్యం, భద్రతకు అవసరమైన చర్యలు చేపడుతూ వారికి అన్ని విధాలా సహకారం అందిస్తామని తెలిపారు. చిట్యాల మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం పారిశుద్ధ్య కార్మికులకు చైర్‌పర్సన్ పందిరి గీతా రమేష్ దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులు ప్రతిరోజూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కష్టపడి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. విధుల్లో భాగంగా వారు తమ ఆరోగ్యం, భద్రతను నిర్లక్ష్యం చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రజలకు పరిశుభ్రమైనవాతావరణాన్ని అందించేందుకు మున్సిపల్ సిబ్బంది చేస్తున్న కృషికి ప్రజలు కూడా సహకరించాలని కోరారు. చెత్తను ఇష్టారీతిన రోడ్లపై పడేయకుండా మున్సిపల్ సిబ్బంది సూచనలను పాటించాలని సూచించారు. ప్రజలు, పారిశుద్ధ్య కార్మికులు, మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే చిట్యాలను మరింత పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దవచ్చని అన్నారు.పారిశుద్ధ్య పనుల నిర్వహణలో కార్మికుల భద్రతకు అవసరమైన రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు,వారి సంక్షేమానికి మున్సిపాలిటీ తరఫున తగిన ప్రాధాన్యత ఇస్తామని చైర్‌పర్సన్ తెలిపారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గుండెబోయిన శ్రీలక్ష్మిసైదులు, కమిషనర్‌ఉప్పలగురులింగం,మేనేజర్‌ఫాతిమా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, కౌన్సిలర్లు జెరిపోతుల సత్యనారాయణ, ఏర్పుల పరమేష్, షబాన అజీమ్, బొబ్బల సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీలోకి నేరడకు చెందిన నవీన్‌రెడ్డి.



చిట్యాల,నల్లగొండ: సెప్టెంబర్ 02(జ్యోతి ప్రభంజనం):చిట్యాల మండలంలోని నేరడ గ్రామానికి చెందిన దుబ్బాక నవీన్‌రెడ్డితో పాటు పలువురు బుధవారం బీజేపీలో చేరారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన వారికి కాషాయ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ వర్గాలకు చెందిన వారు పార్టీలో చేరుతున్నారని తెలిపారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. నూతనంగా పార్టీలో చేరిన కార్యకర్తలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ పార్టీ అభివృద్ధిలో భాగస్వాములను చేస్తామని అన్నారు.పార్టీలో చేరిన నవీన్‌రెడ్డితో పాటు ఇతరులు బీజేపీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. గ్రామాల్లో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ ప్రజలకు చేరువయ్యేలా పనిచేయాలని నాయకులు సూచించారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కంబాలపల్లి సతీష్‌కుమార్, పార్టీ నాయకులు కాసోజు శంకరాచారి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు.

చిట్యాల, నల్లగొండ, సెప్టెంబర్ 02 (జ్యోతి ప్రభంజనం);నల్గొండ జిల్లా చిట్యాల మండలం నేరడ గ్రామంలో చిట్యాల మండల జనసేన నాయకులు నాగార్జున ప్రవీణ్ కుమార్ చారి ఆధ్వర్యంలో జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.బాణసంచా కాల్చి, భారీ కేక్ కట్ చేసి పెద్ద ఎత్తున సంబరాలు జరిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ గారు కేవలం సినిమా హీరో మాత్రమే కాదని, పేదల, రైతుల, యువత కోసం నిలబడే నిజమైన నాయకుడని అన్నారు.ఆయన స్ఫూర్తితో తెలంగాణలో కూడా జనసేనను బలోపేతం చేస్తామని, అవినీతి రహిత సమాజం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాపోలు గణేష్, ఐత రాజు స్వామి, మురళి జనసేన కార్యకర్తల పవన్ కళ్యాణ్ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



printed and published by **Rapolu Lingaswamy**,onbehalf of printed at **SMILYS ONLINE** 6-7-48, Vanasthali Puram Shoping Complex, Dist:Rangareddy,stete:Telangana **Editor: Rapolu Lingaswamy.pone:9908103501,** PRGI **NO:TGTEL/26/A6501 Email: rapolulingaswamy01@gmail.com**